క్లుప్తంగా

నేడు కాపుల కార్తిక వన సమారాధన

అమలాపురం టౌన్: స్థానిక గండువీధిలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మంటపంలో శనివారం కాపుల కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలుగు అభ్యుదయ సంఘం ఆహ్వాన కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. సామాజిక వర్గీయులు కుటుంబ సమేతంగా వచ్చి కార్తిక వన సమారాధనలో పాల్గొనాలని కోరింది.

ఏడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ కన్వీనర్లు

అమలాపురం టౌన్: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నియమించిన ఏడుగురు కన్వీనర్లకు బాధ్యతలను అప్పగిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు నియామక పత్రాలను అందించారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గానికి కన్వీనర్‌గా నియమితులైన వంటెద్దు బాబి, అమాపురానికి వాకపల్లి రాంబాబు, రాజోలుకు కుడుపూడి శ్రీనివాసరావు, ముమ్మిడివరానికి గెద్దం సురేష్ బాబు, కొత్తపేటకు పి.ఉదయ భాస్కరవర్మ, మండపేటకు గాలింక చిట్టిబాబు, రామచంద్రపురానికి సంగిత సత్యనారాయణకు నియమాక పత్రాలు అందించి బాధ్యతలు అప్పగించారు.

రైతులను ఆదుకోవాలి

ముమ్మిడివరం: తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఖరీఫ్ రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని పలువురు నాయకులు విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరింలో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ జగతా పద్మనాభం అధ్యక్షతన శుక్రవారం సలహా మండలి సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకులు పెన్మత్స చిట్టిరాజు, పంటనష్ట పరిహారం సమోదులో ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని, వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ త్వరగా ముంపునీరు దిగేందుకు, మురుగు నీటి కాలువలలోని అడ్డంకులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖాధికారులకు సూచించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంవీ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఎంపీపీ కోలా గంగాభవానీ, వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతకుమార్ పాల్గొన్నారు.

కాల్వను బాగు చేసుకున్న ప్రజలు

అమలాపురం టౌన్: తుపాను ప్రభావంతో కురిసిన కుండపోత వర్షాలకు కాల్వలు, డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూడు, చెత్తా చెదారం అడ్డుగా నిలిచి ముంపు నీరు లాగని పరిస్థితులపై మండలంలోని రోళ్లపాలెం గ్రామస్తులు కొందరు నడుం బిగించారు. గ్రామంలోని పారుతున్న కాల్వలో అడ్డంకులను గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి సత్యనారాయణ, ఉల్లింగి సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీనివాసరావు, నాగుబత్తుల శ్రీను, రాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శ్రమదానం చేసుకుని వారి పంట కాల్వను వారే బాగు చేసుకుని సాగు నీరు సక్రమంగా పారేలా చేసుకున్నారు.

స్కాట్ సాహసయాత్రలో నవోదయ బాలిక

యానాం: మధ్యప్రదేశ్‌లో పంచ్‌మడిలో భారత స్కాట్స్ అండ్ గైడ్స్ శిక్షణ సెంటర్ ఆధ్వర్యంలో నవంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన అఖిలభారత నవోదయ విద్యాలయాల భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ సాహసయాత్రలో యానాం నవోదయ విద్యాలయ విద్యార్థిని దివ్య విజయవంతంగా పాల్గొందని శుక్రవారం ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. హైద్రాబాద్ రీజియన్ నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థిని దివ్యకు మార్గదర్శనం చేసిన స్కాట్ మాస్టర్ డి.పాపారావును అభినందించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఐ.పోలవరం: ఇటీవల సంభవించిన తుపాను కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు అండగా ఇండియన్ రెడ్ క్రాస్ నిలుస్తుందని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ అన్నారు. మండలంలో టి.కొత్తపల్లి అడవిపేటలో మిచాంగ్ తుపాను కారణంగా భారీ వర్షాలకు ముమ్మిడివరపు వెంకటేశ్వరావు ఇల్లు పూర్తిగా కూలిపోయి ఆ కుటుంబం నిరాశ్రయమైంది. శుక్రవారం బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ అండగా నిలబడి హైజనిక్ కిట్, టార్పాలిన్‌ను అందించారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2023–24 విద్యాసంవత్సరానికి ఫ్రెష్, రెన్యువల్ స్కాలర్‌షిప్‌లు పొందడానికి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఆదిద్రావిడ శాఖ ఏడీ ఆర్.కృష్ణమూర్తి ప్రకటనలో కోరారు. పీఎఫ్ఎంఎస్ ద్వారా స్కాలర్‌షిప్ మొత్తం ఆయా బ్యాంకు అకౌంట్లలో బదిలీ చేయడానికి ఆధార్‌తో ఈకేవైసీ, ఎన్‌పీసీఐతో తప్పనిసరిగా లింక్ చేయించుకోవాలన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 15 ఆఖరు తేదీ అని తెలిపారు.

అడుగడుగునా ఆధ్యాత్మికమే

- అంతటా కార్తికమాస సందడి
- ఆలయాల్లో లక్ష పత్రి పూజలు... వనాల్లో సహపంక్తి భోజనాలు
- పంచారామాలు, ప్రముఖ క్షేత్రాలకు తీర్థయాత్రలు


తాళ్లరేవులో కార్తిక దామోదరునికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు (ఫైల్)


సుంకరపాలెంలో అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న స్వాములు

తాళ్లరేవు: పరమ పవిత్రమైన కార్తికమాసంలో అడుగడుగునా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన మాసం కావడంతో ఆలయాల్లో పూజలు, మరోవైపు వనభోజనాలతో సందడి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా కార్తిక సోమవారం పర్వదినంలో తెల్లవారుజామునే నదుల్లో పవిత్ర స్నానాలు, ఆలయాల్లో పూజలతో భక్త పారవశ్యం కనిపిస్తోంది. పవిత్రమైన కార్తిక పౌర్ణమి, ఏకాదశిలలో విశేష పూజలు నిర్వహించారు. కార్తిక ఆదివారాల్లో వనభోజనాలతో సందడి నెలకొంటోంది. మహిళలు ఉసిరిచెట్ల వద్ద కార్తిక దామోదరునికి పూజలు నిర్వహిస్తుంటారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు అందరూ కలిసి ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు.

భక్తిశ్రద్ధలతో లక్షపత్రి పూజలు..

మండల పరిధిలోని నీలపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మీనాక్షి సమేత నీలకంఠేశ్వరస్వామివారి ఆలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా లక్షపత్రి పూజ నిర్వహించారు. పిల్లంక–బ్రహ్మపురి సరిహద్దులో వేంచేసియున్న శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో గత నెల 27వ తేదీన లక్ష రుద్రాభిషేకం, కార్తీక దీపోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన తాళ్లరేవు పురాతన శివాలయంలో లక్షపత్రి పూజ, కార్తిక దీపోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గత నెల 29వ తేదీన కనకాలపేట గ్రామంలో కాటంశెట్టి వెంకట రామ్మూర్తి స్వగృహంవద్ద 108 కలశల పూజ, భక్తి శ్రద్ధలతో అయ్యప్ప లక్షార్చన పడిపూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 7వ తేదీన ప్రముఖ వేద పండితులు వేలూరి కాశిబాబు నేతృత్వంలో 11 మంది రుత్విక్కులతో కలిసి పంచారామ యాత్రను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని చంద్రప్రతిష్ఠిత లింగమైన చొల్లంగి శ్రీ రాజరాజేశ్వరి సమేత సోమేశ్వర స్వామివారి ఆలయం, సుంకరపాలెం శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి, పాతకోరంగి కురంగేశ్వరస్వామి, ఉప్పంగల రామలింగేశ్వరస్వామి తదితర ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

పంచారామాల దర్శనం

కార్తికమాసంలో భక్తులు పుణ్య క్షేత్రాలను దర్శించుకున్నారు. ప్రధానంగా పరమేశ్వరుడు కొలువుండే


ప్రత్యేక అలంకరణలో నీలపల్లిలోని మీనాక్షి సమేత నీలకంఠేశ్వరస్వామి

ప్రముఖ శైవక్షేత్రాలను దర్శించుకున్నారు. ముఖ్యంగా తారకేశ్వర సంహారంలో తారకేశ్వరుడు మెడలోఉన్న శివలింగం ఐదు ముక్కలుగా పడి ఏర్పడిన పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట క్షేత్రాలను ఒకేరోజు దర్శించుకోవడం ద్వారా సకల పాపాలు హరించడంతోపాటు విశేష ఫలితాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. కార్తికమాసంలో భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా నడిపింది.

సమస్త పాపాలు నశించి కోరికలు నెరవేరతాయి



కార్తిక మాసంలో పరమేశ్వరుని భక్తి శ్రద్ధలతో పూజించడం ద్వారా సకల పాపాలు హరించడంతో పాటు కోరికలు నెరవేరతాయి. పరమేశ్వరునికి ప్రీతిపాత్రమైన ఈ మాసంలో చెంబుడు నీళ్లతో అభిషేకం చేసినా విశేష ఫలితాలు సిద్ధిస్తాయి. ఈశ్వర ధ్యానం ద్వారా మానవ జీవితానికి పరమార్థం ఏర్పడుతుంది.

– వేలూరి వెంకట కామేశ్వర శర్మ, వేద పండితులు, పిల్లంక, తాళ్లరేవు మండలం

జగనన్న పాలనలోనే రాష్ట్రాభివృద్ధి


పోలేకుర్రులో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మహిళకు కరపత్రం అందజేస్తున్న నాయకులు

తాళ్లరేవు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే రావాలని వైఎస్సార్ సీపీ మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం పోలేకుర్రు పంచాయతీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గ్రామ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ప్రగతి పథంలో నడిపిస్తున్న జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌ను నాయకులు ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, పార్టీ గ్రామ కన్వీనర్ వీరబాబు, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ పాల్గొన్నారు.

రేపు లక్ష రుద్రాక్షల పూజ

అమలాపురం టౌన్: స్థానిక రవణం వీధిలో గరిగుంట చెరువు వద్ద గల శ్రీ సర్వమంగళ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏటా కార్తిక మాసంలో నిర్వహించే లక్ష రుద్రాక్ష పూజ ఆదివారం నిర్వహిస్తాని ఆలయ అనువంశిక ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాచిరాజు రవికుమార్ తెలిపారు. కాశీ పుణ్య క్షేత్రం నుంచి ప్రత్యేకంగా రప్పించిన పంచ ముఖి రుద్రాక్షలతో ఈ పూజ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆలయ ప్రాంగణంలో కొలువైన సర్వమంగళాదేవికి శత సహస్ర కుంకుమ పూజ, ప్రసన్నాంజనేయస్వామికి శత సహస్ర సిందూర నాగవల్లీ దళ పూజ, మోక్ష గణపతికి శత సహస్ర గరికి పూజ, షిర్డీ సాయిబాబాకు శత సహస్ర బిల్వార్చన కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్వయం ఉపాధితోనే మహిళా సాధికారత

ఎంపీ అనురాధ

అమలాపురం టౌన్: స్వయం ఉపాధి మార్గాలతోనే సమాజంలో మహిళా సాధికారత సాకారమవుతుందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ అన్నారు. హైదరాబాద్ బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి (బైరెడ్) సంస్థ, జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీసత్యసాయి కల్యాణ మంటపంలో 37 రోజులుగా మహిళలకు మగ్గం, జర్దోసిపై జరుగుతున్న ఉచిత శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా బైరెడ్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రామారావు అధ్యక్షతన శ్రీసత్యసాయి కల్యాణ మంటపంలో శుక్రవారం జరిగిన ముగింపు సభలో ఎంపీ అనురాధ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. బైరెడ్ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా మహిళల స్వయం ఉపాధికి చీరలు, జాకెట్ల అలంకరణలో నేడు కీలక పాత్ర పోషిస్తున్న మగ్గం, జర్దోసిపై ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. మహిళలకే కాకుండా పురుషులకు కూడా స్వయం ఉపాధి కోసం ఉచిత



ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీ అనురాధ

శిక్షణలు ఇవ్వాలని ఎంపీ అనురాధ బైరెడ్ సంస్థకు సూచించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు అడబాల కొండబాబు మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న 75 మంది మహిళలకు ఎంపీ అనురాధ బైరెడ్ సంస్థ తరఫున ధ్రువీకరణ పత్రాలు, సత్యసాయి చిత్ర పటం, క్యాలెండర్ అందజేశారు. అమలాపురం డివిజన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి

అల్లవరం: ప్రత్యేక అవసరాల గల పిల్లలను భారంగా కాకుండా ప్రేమతో ఆదరించాలని ఎంపీ చింతా అనురాధ అన్నారు. గోడిలంక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ కిరణ్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ అనురాధ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దివ్యాంగులకు అసాధారణమైన తెలివితేటలు ఉంటాయని, వారు ఈ దేశానికి ఎంతో ఉపయోగమన్నారు. పుట్టుకతోనే అంధుడైన మన జిల్లాకు చెందిన కట్టా సింహాచలం ఐఏఎస్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, కాలు లేకపోయినా జైపూర్ ఫుట్ అమర్చుకుని సుధాచంద్రన్ న్యాటం చేస్తుందని గుర్తు చేశారు.

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలతోపాటు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందన్నారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా అందించిన ట్యాబ్‌లను ఎంపీ అందించారు. ఆటల


ప్రత్యేక అవసరాల గల పిల్లలతో ఎంపీ అనురాధ

పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటిని దివ్యాంగులకు మెడల్, ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు.

జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారయణ, జిల్లా ఫైనాన్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, దత్తుడు రాజు, గోడిలంక హైస్కూల్ హెచ్ఎం, బేగం, ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులు టి.శ్రీనివాస్, ఏ.భవాని పాల్గొన్నారు.

కామాక్షి పీఠంలో కార్తిక దీపాల శోభ


అమలాపురం శ్రీకామాక్షి పీఠంలో పూజలు చేస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షి పీఠంలో కార్తిక మాసం చివరి శుక్రవారం వందలాదిగా మహిళలు తరలివచ్చి కార్తిక దీపాలు వెలిగించడంతో పీఠం ప్రాంగణం శోభను సంతరించుకుంది. పీఠాధిపతి కామేశ మహర్షి కార్తిక దీపాలు వెలిగించిన మహిళలను ఆశీర్వదించారు. పీఠం బాల బ్రహ్మచారి విఘనస రాఖీప్రేమ్ ఆధ్వర్యంలో కార్తిక పూజలు జరిగాయి. పీఠంలోని శ్రీ కామాక్షీ రామలింగేశ్వరులకు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం మహిళా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

బడ్జెట్ అంచనాలు ఆమోదం

వాడీ వేడిగా అల్లవరం మండల సమావేశం

అల్లవరం: 2023–24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2024–25 సంవత్సరానికి రూ.33.51 కోట్లతో రూపొందించిన బడ్జెట్ అంచనాలను మండల పరిషత్ సమావేశం ఆమోదించింది. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరుని వివరించారు. ఇంటింటికీ తాగునీరు అందించే జల జీవన్ మిషన్ రెండో ఫేజ్‌లో నిధులు మంజూరయ్యాయని ఏఈ స్వామి తెలిపారు. తుపాను ప్రభావంతో విరిగిన కరెంట్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించామని చెప్పారు. ఎంపీ ల్యాండ్స్ నిధులతో 48 స్తంభాలు, 2,400 మీటర్ల పొడవునా విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశామని ఏఈ హరిబాబు తెలిపారు. జీజీఎంపీ నిధులు వెచ్చించడంలో సమాచారం ఇవ్వకుండానే ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు మౌనిక, రాజేశ్వరీ, రంగనాథస్వామి అన్నారు. జీజీఎంపీ నిధులు, రూ. 20 లక్షలతో


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

గ్రామంలో అభివృద్ధి పనులకు టీడీపీకి చెందిన సర్పంచ్ వడ్డి సుభాషిణీ పంచాయతీ నుంచి తీర్మానం ఇవ్వకుండా గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారని అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు పులుసుగంటి రాజేశ్వరి ప్రస్తావించారు. దీంతో సర్వ సభ్య సమావేశంలో వాగ్వాదం జరిగింది. ఎంపీపీ శేషగిరిరావు కలగజేసుకుని మంత్రి విశ్వరూప్ సమక్షంలో సమస్యకు పరిష్కరం చూపుతామని చెప్పడంతో వాగ్వాదం సద్దుమణిగింది. రెండేళ్లుగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయమని అడిగినా విద్యుత్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు ప్రశ్నించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల రామకృష్ణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు, తహసీల్దార్ సాంబశివప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పేరూరులో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి'


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన ఏఎంసీ చైర్‌పర్సన్ దొలమణ, ఎంపీపీ భాగ్యలక్ష్మి

అమలాపురం రూరల్: పేరూరు సచివాలయం–2లో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డొలమణ, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. అభివృద్ధి పనులను తెలియజేసే బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యులు సుబ్బిరామ్, అంజి, శ్రీను, ఉప సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు

పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన


ముమ్మిడివరంలో ఎన్నికల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ యువరాజ్

ముమ్మిడివరం: పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యువరాజ్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలో జెడ్పీ ఉన్నత పాఠశాల 14వ నంబరు పోలింగ్ బూత్‌లో ఓటు నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. కొత్త ఓటు నమోదు, అడ్రస్ మార్పు, చేర్పులతో పాటు చనిపోయిన ఓట్లు తొలగింపు వంటి ప్రక్రియకు సంబంధించి ఫారం నంబరు 6,7,8లో అనుసరించాల్సిన విధి విధానాలను పూర్తి పారదర్శకతతో పాటించాలని సూచించారు. ఆయన వెంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీవీ సత్యవాణి, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు ఉన్నారు.

ప్రభుత్వ నిబంధనలను పాటించాలి

తాళ్లరేవు: జీఓలను అనుసరించి పంచాయతీలలో సక్రమమైన పాలన నిర్వహించాలని ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి కోరారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని, వాటన్నింటినీ ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, మండల పరిషత్ కార్యాలయ ఏఓ చింతా మోహనకృష్ణ పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ భైరవమూర్తి

స్వచ్ఛందంగా పూడికతీత పనులు

అమలాపురం రూరల్: తుపాను వర్షాలకు పంట పొలాలు నీటి మునిగి పోవడంతో రైతులు పంటలు నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీటిని తొలగించడానికి కాలువలో పూడుకుపోయిన చెత్తను, మట్టిని జేసీబీతో రైతులు స్వచ్ఛందంగా తీయించివేశారు. నల్లమిల్లి, జనుపెల్ల, గ్రామాల్లో రైతులు నడిపూడి నల్లమిల్లి ప్రధాన పంట కాలువ సమస్యను సర్పంచ్ చెల్లుబోయిన నాని దృష్టికి తీసుకుని వచ్చారు. దీంతో ఆయన స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుని జేసీబీ ఏర్పాటు చేసి చెత్త తొలగించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, రైతు సంఘం అధ్యక్షుడు అప్పారి చిన్న వెంకటరమణ, రైతులు రమణాతి పల్లంశెట్టి, చెల్లుబోయిన బుజ్జి, అప్పారి సాయిబాబు, బొక్క కృష్ణ పాల్గొన్నారు.


నల్లమిల్లి డ్రైనేజీలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ నాని తదితరులు

దాతల సహకారంతో స్నానఘట్టం నిర్మాణం


శ్మశాన వాటికలో స్నానఘట్టాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి పంచాయతీ పరిధిలో వాడపర్రు గ్రామానికి చెందిన మారిశెట్టి మరిడయ్య, రామాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.3 లక్షలతో నిర్మించిన స్నాన ఘట్టాన్ని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ శుక్రవారం ప్రారంభించారు. శ్మశాన వాటికలో అంత్యక్రియల అనంతరం స్నానమాచరించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మరిడయ్య కుటుంబీకులు జల్లు స్నానం, దుస్తులు మార్చుకునేందుకు గదిని నిర్మించి గ్రామానికి అంకితం చేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబాన్ని సర్పంచ్, గ్రామస్తులు అభినందించారు. మారిశెట్టి పుండరీకాక్షుడు, వీరవల్లి చినబాబు, మురముళ్ల రామం, మారిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం


చుంచులా డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

అల్లవరం: కలెక్టర్ ఆదేశాల మేరకు బెండమూర్లంకలోని చుంచులా మైనర్ డ్రెయిన్‌లో కిలోమీటరు పొడవునా పూడిత తీత పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ పనులతో 80 ఎకరాల్లో ముంపు ప్రభావం తీరుతుందని, 32 మందికి ప్రయోజనం చేకూరుతుందని ఎంపీపీ శేషగిరిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ ముత్యాల వెంకట రామకృష్ణ, సర్పంచ్ బర్రే సీతారత్నం, ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ ప్రశాంతి

తాళ్లరేవు: తుపాను కారణంగా నష్ట పోయిన రైతులను ఆదుకుంటామని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నష్టం సంభవించిన ప్రతీ రైతుకు పరిహారం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ తుపానుకు సంబంధించి నష్ట పరిహారం అంచనా కార్యక్రమం జరుగుతోందన్నారు. ధాన్యం కొనుగోలు యథావిధిగా జరుగుతుందన్నారు. సలహా మండలి ప్రతినిధులు కొటికెలపూడి చందు, అనిశెట్టి శ్రీనివాస రెడ్డి, కొల్లు రాజు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మకు వెండి ఆభరణాల సమర్పణ

యానాం: గౌతమీ గోదావరి తీరంలో కొలువైన శ్రీదత్తమణికంఠ పూజామందిరంలో మహాలక్ష్మమ్మవారికి శుక్రవారం రాజమహేంద్రవరానికి చెందిన మురళీకృష్ణ దంపతులు వెండి ఆభరణాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వెండి చేతులు, వెండి వడ్డాణం బహుకరించారు. తమ కోరిక నెరవేరినందుకు కృతజ్ఞతగా ఆభరణాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వెండి ఆభరణాలకు విశేషపూజలు చేసి అమ్మవారికి అలంకరించారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

అల్లవరం: కొమరగిరిపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి పోన్నపల్లి తిరుపతిరావును గాయపరిచింది. హైస్కూల్ నుంచి ఇంటికి వస్తున్న ఓ విద్యార్థిని, మరో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిందని అంతేకాకుండా పశువులు, కుక్కలను గాయపరిచిందని గ్రామస్తులు తెలిపారు.